



గడువు ముగిసింది బకాయి మిగిలింది

- ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేసిన మిల్లర్లు
- సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వడంలో పూర్తిగా నిర్లక్ష్యం
- 1.06 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం బకాయి హెచ్చరికలు బేఖాతరు
- 16 రైస్‌మిల్లులను డిఫాల్టర్లుగా ప్రకటించిన అధికారులు
- మరో ఏడు రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు

నిర్మల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీఎంఆర్ బియ్యం అప్పజెప్పే విషయంలో రైస్‌మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2023-2024 ఖరీఫ్, రబీసీజన్‌లకు సంబంధించి సీఎంఆర్ బియ్యం చెల్లింపు విషయంలో ఇప్పటికే పలుసార్లు గడువు విధించిన ప్రభుత్వం మరోసారి ఈ నెల 15వ తేదీ వరకు గడువు పెంచింది. ఆదివారంతో ఈ గడువు ముగిసినప్పటికి రైస్‌మిల్లర్లు మాత్రం ఇంకా కేటాయించిన కోటాకు అనుగుణంగా సీఎంఆర్ బియ్యాన్ని మాత్రం ఇప్పటి వరకు అప్పజెప్పలేదు. అయితే ఈసారి కూడా గడువులోగా పూర్తి స్థాయిలో సీఎంఆర్ బియ్యాన్ని రైస్‌మిల్లర్లు తిరిగి ఇచ్చే అవకాశాలు లేవని చెబుతున్నారు. 2023-2024 ఖరీఫ్ సీజన్‌కు గానూ 1.42.759లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లర్లకు సీఎంఆర్ కోసం కేటాయించారు. దీనికి అనుగుణంగా రైస్‌మిల్లర్లు 95,942 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యంను ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు 79,326 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. ఇంకా 16,616 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది.

రబీ బియ్యంపైనా నిర్లక్ష్యం

223-2024 రబీసీజన్‌కు సంబంధించిన రైస్‌మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వడంలో పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు ఇప్పటికే పలుసార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ రైస్‌మిల్లర్లు మాత్రం సీఎంఆర్ బియ్యాన్ని తిరిగి ఇవ్వడంలో జాప్యం చేస్తుండడం అధికారులు ఆగ్రహానికి కారణమవుతోంది. ఈ సీజన్‌కు సంబంధించి 1.56.847 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం జిల్లాలోని రైస్‌మిల్లులకు కేటాయించారు. ఈ కేటాయింపులకు అనుగుణంగా 1.05.697 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి సీఎంఆర్ కింది రైస్‌మిల్లర్లు అప్పజెప్పాలి. అయితే ఇప్పటి వరకు కేవలం 15,067 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. ఇంకా 90,090 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి రైస్‌మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. ఈ బకాయిపడ్డ సీఎంఆర్ బియ్యాన్ని ఈ నెల 15లోగా ఇవ్వాలంటూ ప్రభుత్వం గడువు విధించింది. అయితే ఈ గడువులోగా కూడా సీఎంఆర్ బియ్యం చెల్లింపు పూర్తవ్వడం కష్టసాధ్యమేనంటున్నారు. ఈ గడువు ఆదివారంతో ముగిసినప్పటికీ రైస్‌మిల్లర్లలో చలనం కనిపించడం లేదంటున్నారు.

చర్యలు నామమాత్రమే

జిల్లాలో దాదాపు 100 కోట్ల రూపాయల విలువకు పైగా సీఎంఆర్ ధాన్యం మాయమైనట్లు అధికారుల తనిఖీల్లో స్వయంగా వెల్లడైంది. మొత్తం 16 రైస్‌మిల్లులను డిఫాల్టర్లుగా ప్రకటించడమే కాకుండా అవకతవకలకు పాల్పడ్డ మరో ఏడు రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. 2022-2023 ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి ఏడు రైస్‌మిల్లులు 107 కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు అధికారులు నిర్ధారించారు. అలాగే బ్యాంకు గ్యారెంటీ విషయంలో కూడా చాలా మంది రైస్‌మిల్లర్లు అనేక రకాల తిరకాసులు పెట్టారు. దీని కారణంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ చేసే విషయంలో అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

మల్లగుల్లాలు

2023-2024 ఖరీఫ్, రబీ సీఎంఆర్ బకాయిలకు సంబంధించి గడువు ముగిసినప్పటికీ మిల్లర్లు మాత్రం బియ్యం ఇచ్చే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సర్కారు హెచ్చరికలను బేఖాతరు చేస్తున్నప్పటికీ వారిపై అధికారులు చర్యలు తీసుకునే విషయంలో వెనకాడుతున్నట్లు ఆరోపణలున్నాయి. అయితే మళ్ళీ గడువు ముగిసినప్పటికీ ఈ సారి అధికారులు బకాయిదారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న ఆసక్తి నెలకొంటోంది. రైస్‌మిల్లర్లు ప్రతిఖరీఫ్, రబీసీజన్‌లకు సంబంధించి సీఎంఆర్ బియ్యాన్ని కేటాయింపులకు అనుగుణంగా తిరిగి ఇవ్వపోతుతుండడం రివాజుగా మారింది. అధికారులు సీఎంఆర్ విషయంలో హెచ్చరికలు జారీ చేస్తుండడం, ఆ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ బియ్యం తిరిగి ఇవ్వపోతుండడం రివాజుగా మారింది. నామమాత్రపు జరిమానాలు, షోకాజు నోటీసులతోనే సరిపుచ్చుకున్నారంటున్నారు. అయితే ఈ సారి చర్యలు తీసుకునే అవకాశాలున్నట్లు సంకేతాలు వెలువడినప్పటికీ గడువు ముగిసిన ఇప్పటి వరకు మిల్లర్లు ఆశించిన రీతిలో స్పందించలేదన్న ఫిర్యాదులున్నాయి. ఈ సారి అధికారులు బకాయి పడ్డ మిల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోననే అంశం ప్రస్తుతం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.



కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యం రాశులు

బాసరలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ప్రత్యేకపూజలు



అమ్మవారి ఆలయంలో తన మనుమడికి అక్షర శ్రీకారం జరిపిస్తున్న చైర్మన్ వెంకటయ్య

బాసర, డిసెంబరు, 20 : (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రత్యేకపూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో ఆలయానికి చేరుకున్న చైర్మన్‌కు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తన మనుమడికి అమ్మవారి సన్నిధిలో అక్షర శ్రీకారపూజలు జరిపించారు.

నేడు నూతన ఆలయ శిఖర స్థాపన

బాసర, డిసెంబరు, 20 : (ఆంధ్రజ్యోతి) : బాసర మండల కేంద్రంలోని పురాతనమైన పాపహరేశ్వరాలయ శిఖర స్థాపన కార్యక్రమం జరగనుంది. ఇందుకోసం గ్రామస్థులు అన్ని ఏర్పాట్లు చేశారు. శిధిలావస్థకు చేరిన ఆలయాన్ని పునర్నిర్మించి పురాతన శివలింగం మినహా మిగితా దేవతా మూర్తులను పునః ప్రతిష్ఠించనున్నారు.



ప్రతిష్ఠాపన కోసం తెచ్చిన నంది విగ్రహం

దేవరకోట ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని దేవరకోట లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం 6 గంటలకు టీటీడీ ఆళ్వార్ దవ్య ప్రబంధ ప్రాజెక్టు ప్రవచనకర్త టీకే రామకన్నణ్ తిరుప్పావై ప్రవచనాలు చెబుతున్నారు. శుక్రవారం టీటీడీ పర్యవేక్షకుడు విజయకుమారచారి పాల్గొని తిరుప్పావై ప్రాశస్త్యాన్ని వివరించారు. ఆలయ చైర్మన్ కొండా శ్రీనివాస్, అర్చకులు నవీన్ ఆచార్య, భక్తులు పాల్గొన్నారు. ధనుర్మాస పూజకు ప్రతీరోజు ఉదయం పెద్దసంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు.

బస్సులు నడపాలని వినతుల వెల్లువ

- డయల్ యువర్ డీఎంకు అపూర్వ స్పందన



డీఎం ప్రతిమారెడ్డి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఆర్టీసీ డిపో నుంచి పలు ప్రాంతాలకు బస్సులు నడపాలని ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. శుక్రవారం మేనేజర్ ప్రతిమారెడ్డి నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు విశేషస్పందన లభించింది. పెంబి మండల కేంద్రానికి అదనపు బస్సు కోసం విజ్ఞప్తిచేయగా ఖానాపూర్ నుంచి హైదరాబాద్‌కు, భైంసాకు సెమిడీలక్స్ కిన్వట్‌కు బస్సులు నడపాలని కోరారు. సింగాపూర్, రాజురకు పునఃప్రారంభించాలన్నారు. నిర్మల్ నుండి హైదరాబాద్‌కు మరో ఎక్స్‌ప్రెస్ బస్సు నడపాలని కోరారు. సాధ్యమైనంత త్వరలో చర్యలు తీసుకుంటానని డీఎం హామీ ఇచ్చారు.

తరగతి గదిలో విద్యార్థులకు శ్వాస ఆడక ఇబ్బంది

- ముప్పై పడకల ఆసుపత్రిలో చేర్పించిన ఉపాధ్యాయులు



ఆసుపత్రిలో విద్యారులకు వైద్యం చేస్తున్న డాక్టర్

నర్సాపూర్(జి), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి విద్యార్థులు తరగతి గదిలో శ్వాస ఆడక తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పదో తరగతి సాంఘికశాస్త్రం పాఠం వింటున్న శృతి, మహీన్ ఒక్కసారి శ్వాస ఆడక కింద పడిపోవడంతో విద్యార్థులను గమనించి సాంఘిక శాస్త్రం పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు చైతన్య తోటి ఉపాధ్యాయులు భూమేష్‌కు సమాచారం అందించడంతో వెంటనే 30 పడకల ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్ జాదవ్ విజయానంద్ విద్యార్థినులకు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండటాన్ని గమనించి రక్తహీనత, కాల్షియం లోపాలు ఉన్నట్లు లక్షణాలు కనిపించడంతో ఒక గంట పాటు విద్యార్థులకు వైద్యం అందించి ప్రాణాలు కాపాడారు. సకాలంలో విద్యార్థినులను ఆసుపత్రిలో చేర్పించిన ఉపాధ్యాయులను గ్రామస్థులు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ యాదవ్ విజయానంద్ మాట్లాడుతూ... పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిగేలా చూడాలని పాఠశాల యాజమాన్యాన్ని కోరారు.

పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుటుంబ సభ్యులకు పరామర్శ



నిర్మల్ అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం శివారులోని వెంకటాపూర్‌లో మాజీ ఎంపీటీసీ సభ్యుడు, ముక్తాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజారెడ్డిని శుక్రవారం నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు, భాజపా నాయకుడు వి.సత్యనారాయణగౌడ్ పరామర్శించారు. ఇటీవల రాజారెడ్డి మాతృమూర్తి మృతి చెందారు. ఈ మేరకు రాజారెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతికి గల కారణాలను తెలుసుకొని వారికి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట వెంకటాపూర్ మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డి, నాయకులు విజయ్, తిరుపతిరెడ్డి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించేలా చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆమె మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి రోజు చిన్నారులకు, బాలింతలకు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక వసతులను మెరుగుపర్చాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, పిల్లలకు సురక్షితమైన, శుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం, పోషణ, విద్యాపరంగా అవగాహన పెంచాలన్నారు. కేంద్రాల పనితీరు మెరుగుపడి, పిల్లలు, గర్భిణీ స్త్రీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో న్యూట్రి గార్డెన్స్‌లను ఏర్పాటు చేసి పెంచిన ఆకు కూరలు, కూరగాయలను ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించాలన్నారు. ప్రతిరోజు కోడిగుడ్డు, ఇతర పోషకాహార పదార్థాలను అందించి రక్త హీనత, పిల్లల ఎదుగుదల లోపం వంటి సమస్యలను నియంత్రించాలని సూచించారు. చిన్నారులకు క్రమం తప్పకుండా బాలామృతాన్ని అందించాలని, ఏకరూప దుస్తులను అందజేయాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో సూచికల బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పర్యవేక్షకులు అంగన్‌వాడీల నిర్వహణ తీరును పరిశీలించి నివేదికలను పంపాలన్నారు. చిన్నారుల హాజరు శాతం పెంచేందుకు చర్యలు చేపట్టాలని, మండలాల వారీగా అంగన్‌వాడీల్లో నిర్వహిస్తున్న న్యూట్రి గార్డెన్స్, సామ్, మామ్ తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా చిన్నారుల ఎత్తు, బరువు వివరాలను నమోదు చేసి నివేదికలను అందజేయాలన్నారు. అంగన్‌వాడీల పరిసరాల్లో నిరంతరం పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ సమావేశంలో సీడీపీవోలు నాగలక్ష్మి, నాగమణి, సరిత, సరోజినిలు, మండలాల అంగన్‌వాడీ పర్యవేక్షకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణప్రాజెక్టు ఆయకట్టు రైతులకు అవగాహన కల్పించిన అధికారులు

- అధికారులను నిలదీసిన రైతులు
- రైతులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఇరిగేషన్ అధికారులు

సారంగాపూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గల రైతు వేదికలో స్వర్ణ ప్రాజెక్టు కింద సాగు చేస్తున్న ఆయకట్టు రైతులకు శుక్రవారం వేసంగి పంటలకు అందించే సాగునీరుపై ప్రాజెక్టు అధికారులు అవగాహన కల్పించారు. దీంతో వేసంగి పంటలను సాగు చేయడానికి పంట పొలాలకు సాగునీరును అందించే కాలువలకు మరమ్మతు చేపట్టాలని గతంలో గ్రామ కమిటీల ఆధ్వర్యంలో కాలువలలో మొలకెత్తినటువంటి పిచ్చి మొక్కలను తొలగించడం జరిగిందని, దీంతో కాలువల మరమ్మతులు చేపట్టాలని రైతులు ఇరిగేషన్ అధికారులను నిలదీశారు. ప్రాజెక్టు వద్ద పని చేస్తున్నటువంటి అధికారులు పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు అక్కడి పంట పొలాలకు సాగునీరును అందించే కాలువలకు మరమ్మతులను చేయిస్తున్నామని రైతులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడం సరికాదని రైతులపై ఇరిగేషన్ డీఈ ఆగ్రహం వ్యక్తం చేవారు. దీంతో రైతులు సమావేశంలో నుండి బయటకు వెళ్లి వేసంగి పంటకు సాగునీరును అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుంటే ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు.



రైతులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికారులు

పోలీసు జిల్లా కార్యాలయంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎస్పీ జానకీ షర్మిల, అధికారులు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ జానకి షర్మిల క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను ప్రజలు జరుపుకుంటారని ఎస్పీ అన్నారు. కరుణకు మారుపేరు ఏసుక్రీస్తు అని అన్నారు. ఆయన బాటలో నడవాలని ఆకాంక్షించారు. అన్ని మతాల ప్రజలు తమ పండగలను సామరస్యంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, డీఎస్పీ గంగారెడ్డి, ఏవో యూనిస్ అలీ, సీఐలు, ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



భైంసాలో కేక్ కట్ చేస్తున్న రెవెన్యూ అధికారి అశోక్, చర్చిల ఫాస్టర్లు

భైంసా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భైంసాలో శుక్రవారం సెమి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక మఖ్‌రానా ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహింపబడిన సెమి క్రిస్మస్ వేడుకలకు డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల చర్చిల ఫాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు. ప్రభుత్వం తరపున ముథోల్ నియోజక వర్గ ఫాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన వేడుకలకు భైంసా డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్మల్ ఫాస్టర్ రాజ్ కుమార్ బైబిల్ వాఖ్యములను వెల్లడించారు. మానవులు తోటి మానవుల పట్ల మానవత్వం కలిగి ఉండాలన్నారు. ఇలాంటి తరుణంలోనే శాంతి,సౌభగ్యాలు, ఆత్మీయ, అనురాగాలు విరాజిల్లుతాయన్నారు. యేసు మార్గం అనుసరణీయమన్నారు. ఇందులో ముథోల్ నియోజక వర్గ ఫాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి.సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులు సీహెచ్.రమేష్, కార్యదర్శి బి.దేవదాస్, ప్రతినిధులు సంజీవ్, పీటర్ ,నాగాజీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రయాణికులతో ఆర్టీసీ మర్యాద దినోత్సవం



ప్రయాణికులకు పువ్వులు అందిస్తున్న అధికారులు

నిర్మల్ అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ అధికారులు శుక్రవారం ప్రయాణికులకు పువ్వులు అందించి మర్యాదగా ప్రకటించారు. ప్రతీ నెల ఆర్టీసీ మూడో శుక్రవారం మర్యాద దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. డీఎం ప్రతిమారెడ్డి ఆదేశం మేరకు బస్టాండ్‌లో ప్రయాణికులను బస్సులోకి ఆహ్వానించారు. వారికి పువ్వులు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సురక్షిత ప్రయాణం ఆర్టీసీ బస్సులతోనే సాధ్యమన్నారు. ఆర్టీసీ ప్రవేశపెట్టిన గమ్యం యాప్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 31 వరకు ఏసీ బస్సులలో పది శాతం రాయితీ కల్పిస్తున్నామని వివరించారు. అరుణాచలం లాంటి పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. స్టేషన్ మేనేజర్ ఏఆర్ రెడ్డి, కంట్రోలర్లు దేగాం భాస్కర్, జీఆర్‌రెడ్డి, భోజాగౌడ్, సిస్టం ఇన్‌చార్జి రమణ, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల పంపిణి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏక్తా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. గుల్జార్ మజీద్ అధ్యక్షుడు బషీర్ సర్టిఫికెట్లు అందించారు. ప్రధాన కార్యదర్శి అల్మాస్, సాజిద్, జుబేర్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీని కలిసిన ప్రభుత్వ ప్లీడర్లు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్లీడర్, ఉపప్లీడర్‌గా నియమితులైన శుభకరణ్, రాజేశ్వర్‌రావు కుందే శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

తానూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ లింగమూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అదే విధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రూ. 10వేల వేతనం అమలు చేయాలని, ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా పాఠశాలల మధ్యాహ్న భోజనం కార్మికులున్నారు.

బోయవాడలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే

ఉట్నూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బోయవాడలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శంకర్, ఇందిరమ్మ కమిటీ మెంబర్లు అబ్దుల్ ఖయ్యుమ్, బిరుదుల లాజర్, మూతిగంగాధర్, గ్రామ పంచాయతీ సిబ్బంది పొడేటి రాజన్న, దాకూరి అరుణ్, పోడేటి ప్రదీప్‌లు పాల్గొన్నారు.

నిత్యజీవితంలో గణితం ఎంతో ఉపయోగం

బోథ్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిత్యజీవితంలో గణితం ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణితశాస్త్ర దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఎంఈఓ కుమ్మరి పోశెట్టి మాట్లాడుతూ గణితానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, గణితం అనేది కొంతమంది విద్యార్థులకు నేర్చుకోవడం ఇబ్బందిగా ఉంటుందని, అయితే నేర్చుకుంటే గణితమంతా సులువైనది మరో సబ్జెక్టు ఉండదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీచర్ల సమ్మెతో గిరిజన చదువులకు ఆటంకం

బోథ్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐటీడీఏ పరిధిలోని 10 ఏకోపాధ్యాయ పాఠశాలల సీఆర్‌పీలు సమ్మెబాట పట్టారు. దీంతో మండలంలోని 10 పాఠశాల విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. అసలే గిరిజన గ్రామాలలోని ఏకోపాధ్యాయ పాఠశాలలో విద్యాబోధన ఆశించిన స్థాయి పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే సీఆర్‌పీల సమ్మెపై స్పందించి ప్రభుత్వ పాఠశాలలో చదువులు కొనసాగేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మార్కెట్‌లో సోయాబీన్ బస్తాలు మాయం!

బోథ్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలో ఈనెల 5న మార్కెట్‌కు కొంతమంది వ్యక్తులు తీసుకువచ్చిన సోయాబీన్ బస్తాలు దొంగతనానికి గురైనట్లు తెలుస్తోంది. దాదాపు 40బస్తాలు దొంగిలించినట్లు తెలిసింది. దొంగతనం జరిగిన సమయంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడం గమనార్హం. సోయా బస్తాల దొంగతనం వ్యాపారుల మధ్య తీవ్ర చర్చగా సాగుతోంది.

రాథోడ్ రమేష్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఇంద్రవెల్లి, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏమ్మైయికుంట, గలియాబాయి తండా గ్రామంలో శుక్రవారం మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరేల్లి రాజలింగం, మహిళా మోర్చా అధ్యక్షురాలు రాథోడ్ రాధిక, నాయకులు మోరే దిలిప్, మాస్కే రాజవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బోథ్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బజార్హత్నూర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5గంటల వరకు సోనాల, బజార్హత్నూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్టు

గుడిహత్నూర్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాన్కపూర్ గ్రామంలో శుక్రవారం గంజాయి స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. కుమ్ర హన్మంతు అనే వ్యక్తి ఇంటిలో తనిఖీలు చేయగా 800 గ్రాముల ఎండుగంజాయి లభించిందని, గ్రామ సమీపంలో తనకున్న వ్యవసాయ భూమిలో గంజాయి సాగుచేసినట్లు ఒప్పుకున్నాడని ఎస్సై తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.20 వేల వరకు ఉంటుందని చెప్పారు. పంచనామా నిర్వహించి అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బరంపూర్‌లో యువకుడికి పాము కాటు

తలమడుగు, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన అకాష్‌ను పాము కాటేసింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డికి సమాచారం అందించగా ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందించారు. అనంతరం ఝరి గ్రామానికి చెందిన అశోక్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి రిమ్స్ ఆసుపత్రి చికిత్స పొందుతుండడంతో ఆయనను మౌనిష్‌రెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఆయనవెంట మహేష్ యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, మాదూరి వినయ్, ఉల్వకాని అభిలాష్, మాదూరి మహేష్, అఖిల్‌రెడ్డి ఉన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఆదిలాబాద్‌రూరల్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలోని చాంద(టీ) బైపాస్ రోడ్డు వద్ద రెండు రోజుల క్రితం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడి సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో ఎస్సై ముజాహిద్ స్మైల్ సొసైటీ ప్రతినిధులకు సమాచారం అందించారు. ముందుకు వచ్చిన శుక్రవారం మృతదేహానికి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు కేమ శ్రీకాంత్, భూరె సురేష్, రవికాంత్ యాదవ్, కిరణ్, రామకృష్ణ, సాయిగౌడ్, నజీర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నిరసన



కాంగ్రెస్ నేతల నిరసనలో నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ జిల్లా కేంద్రం అంబే ద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు మాట్లాడుతూ... అంబేద్కర్‌ను తక్కువ చేసి మాట్లాడటం దేశాన్ని అవమానించడమే అన్నారు. అమిత్‌షా రాజీనామా చేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షుడు చిన్ను, ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, పూదరి అరవింద్, రఫీ, ఖీజర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ ఫోరమ్ నిరసన



నిర్మల్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ ఫోరమ్ కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆదివాసి గిరిజన సంఘం, కేవీపీఎస్ నాయకులు రత్నం, శంభు, పోశెట్టి, రాజేశ్వర్, అతిక్, తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్(జి), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గత బుధవారం పార్లమెంట్ సాక్షిగా భారతరత్న గౌరవనీయులు డాక్టర్ బీఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వ్యంగ్యంగా ప్రసంగించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సమత సుదర్శన్ డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ వాహిదుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తక్షణమే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బహిరంగ క్షమాపణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వారితో పాటు ఓయూ జేఏసీ నాయకులు యోగేష్, భీమ్ ఆర్మీ జిల్లా నాయకులు సాహెబ్‌రావు, సమత ఫౌండేషన్ సీఈవో అనిల్‌కుమార్, పీఆర్‌వో క్రాంతికుమార్, మీడియా ఇన్‌చార్జి శేఖర్, టీం సభ్యులు ప్రవీణ్; నాయకులు చంద్రయ్య, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు కాంట్రాక్ట్ టీచర్ల సమ్మె



ఉట్నూర్ ఐటీడీఏ ముందు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న సీఆర్టీలు

ఉట్నూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్టీ) సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన నిరవధిక సమ్మె 5వ రోజుకు చేరింది. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు ఆదిలాబాద్, కేబీ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నారు. గత ఐదు నెలలుగా వేతనాలు రాక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రభుత్వం ప్రతీనెల ఒకటో తారీఖున ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్నట్టుగానే సీఆర్టీలకు కూడా ఒకటో తారీఖున వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సైతం సీఆర్టీలకు కల్పించాలని, 180 రోజుల ప్రసూతి సెలవులు మహిళా టీచర్లకు ఇవ్వడంతో ప్రభుత్వాలు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నాయో అర్థం కావడం లేదని అంటున్నారు. సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించి, మినమం టైం స్కేల్ సౌకర్యం కల్పించాలని మొదలైన డిమాండ్లతో వెయ్యికి పైగా మంది సీఆర్టీలు సమ్మెలో పాల్గొంటున్నారు. కొంత మంది పిల్లా పాపలతో సీఆర్టీలు సమ్మె శిబిరానికి వస్తున్నారు. సీఆర్టీల సమ్మెకు పీఆర్‌టీయూ, టీఎస్‌టీటీఎఫ్, టీఎస్‌ఎస్‌టీయూ, డీటీఎఫ్, టీఎస్‌టీపీ టీఎఫ్ ఉపాధ్యాయ సంఘాలతో పాటు ప్రైవేట్ విద్యా సంస్థల యజమాన్యాలు సంఘీభావం తెలిపాయి. కార్యక్రమంలో శేఖర్‌రావు, షబ్బీర్‌అలీరైస్, బొల్లిగాన్నే రాజేశ్వర్, పవర్ అజయ్, బండి శ్రీనివాస్, గోవర్ధన్, సీఆర్టీల సంఘం నాయకులు శంకర్, విజేష్, బాబురావు, శ్రీనివాస్, మునినాయక్, బద్దులాల్, వందన, విద్యారాణి, రామచందర్, కమలాకర్, గోడం శ్రీనివాస్, వినంత్‌రావు, సోమేశ్వర్, రమేష్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ కక్షతోనే కేటీఆర్‌పై అక్రమ కేసు'



సిరికొండ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్షసాధింపుతోనే ఫార్ములా ఈకార్ రేసింగ్‌లో అవకతవకలకు పాల్పడ్డారంటూ కేటీఆర్‌పై అక్రమంగా కేసుపెట్టారని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఒరగంటి పెంటన్న ఆరోపించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. ఫార్ములా ఈకార్ రేస్‌తో తెలంగాణ ప్రతిష్ఠను పెంచిన కేటీఆర్‌ను చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్ని తప్పుడు కేసులు బనాయిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మాజీ మంత్రి కేటీఆర్ లక్ష్యంగా వేధింపులకు పాల్పడుతోందని తెలిపారు. అందులో భాగంగానే ఫోన్‌ట్యాపింగ్, ఎన్‌కన్వెన్షన్, జన్వాడ ఫామ్ హౌస్, లగచర్లపై వరుసగా ఆరోపణలు చేస్తూ, తాజాగా ఫార్ములా ఈ రేసు కేసును పెట్టి వేధిస్తోందని ప్రభుత్వంపై ఈ సందర్భంగా మండిపడ్డారు. ఇది ముమ్మాటికి రాజకీయ కక్షతోనే సాధింపుతోనే కేటీఆర్‌పై అక్రమ కేసుకు తెరలేపారని ధ్వజమెత్తారు.

సీఆర్టీల 4 నెలల ఏరియర్స్, ఆగస్టు నెల వేతనం విడుదల

ఉట్నూర్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న సీఆర్టీల నాలుగు నెలల పెండింగ్ ఏరియర్స్‌తో పాటు ఆగస్టు వేతనం విడుదల చేసినట్లు గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జీ డీడీ జాదవ్ వసంతరావు తెలిపారు. సీఆర్టీల సమ్మె పరిష్కారానికి అధికార యంత్రాంగం చేపడుతున్న చర్యల గురించి సదరు అధికారిని 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి సమ్మె విషయం తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఆగస్టు నెల వేతనంతో పాటు ఏరియర్స్ రూ.2.40 కోట్లు సీఆర్టీల ఖాతాలలో జమ చేసినట్లు చెప్పారు. 154 ఏకోపాధ్యాయ పాఠశాలలు మూతబడ్డాయని, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలు పని చేస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

తాంసి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను జామిడి గ్రామంలో స్టార్ జాగృతి యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ తాంసి మండల యువజన అధ్యక్షుడు ఈరగొల్ల అశోక్‌స్టార్ జాగృతియూత్ సభ్యులు పాల్గొని మాట్లాడారు. అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము చేపట్టే ఆందోళనకు కేంద్రమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు.

అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ భీంఆర్మీ నిరసన

ఆదిలాబాద్‌రూరల్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను కించపరిచే విధంగా మాట్లాలాడారని, వెంటనే ఆయన క్షమాపణలు చెప్పాలని భీంఆర్మీ ఆజాద్ సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్‌షకీల్ డిమాండ్‌చేశారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం ఆదిలాబాద్‌లోని నేతాజీచౌక్ వద్ద నల్ల రిబ్బన్‌లతో నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



జామిడీలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘం యువకులు

నేరడిగొండ: పార్లమెంట్‌లో అమిత్‌షా అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన దానికి వ్యతిరేకంగా శుక్రవారం అంబేద్కర్‌చౌక్‌లో దిష్టిబొమ్మ దహనంచేశారు. కార్యక్రమంలో యువజన సంఘం, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుదిదశకు పంచాయతీ ఎన్నికల కసరత్తు!

(మూడో పేజీ తరువాయి)

గరిష్ఠంగా 650 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● ఎన్నికల విధుల్లో 3894 మంది

పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు జాబితా పోలింగ్ స్టేషన్ల తుదిజాబితాను విడుదల చేశారు. ఎన్నికల విధులను నిర్వహించేందుకు మొత్తం 3894 మంది అధికారులు అవసరమని గుర్తించి ఎంప్లాయిస్ డాటాఎంట్రీని కూడా పూర్తిచేశారు. బ్యాలెట్ బాక్సుల మరమ్మత్తులు, ఇతర ఎన్నికల సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. తుది ఓటరు జాబితాతో జిల్లా గ్రామీణ ఓటర్ల సంఖ్య 4లక్షల 47వేల 135కు చేరింది. ఇప్పటికే ఓటర్, పోలింగ్‌స్టేషన్ల జాబితాలను ఆయా మండల పరిషత్ కార్యాలయాలతో పాటు గ్రామ పంచాయతీల్లోను ప్రదర్శించారు. ఈనెల 31లోగా బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేసేందుకు జిల్లాకేంద్రంలోని అన్ని ప్రింటింగ్ ప్రెస్‌లకు ఆర్డర్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

● ఎట్టకేలకు ఉట్నూర్‌కు ఎన్నికలు

గత ప్రభుత్వ హయాంలో ఉట్నూర్‌ను మున్సిపాలిటీగా మార్చేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగిన ఏజెన్సీ చట్టాలు ఇబ్బందికరంగా మారడంతో ప్రభుత్వం వెనుకడుగు వేసింది. దీంతో గతంలో ఉట్నూర్ పంచాయతీకి ఎన్నికలు జరుగలేదు. అప్పటినుంచి ప్రత్యేకాదికారుల పాలనలోనే ఉట్నూర్ పంచాయతీ పాలన కొనసాగుతుంది. ఎందరో మంది ఆశావహ నేతలకు నిరాశే మిగిలింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉట్నూర్‌ను గ్రామ పంచాయతీగానే కొనసాగిస్తూ ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. మేజర్ గ్రామపంచాయతీ కావడంతో 650నుంచి 1300ల ఓటర్లు ఉన్న సహాయక వార్డులు 18 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సారి ఉట్నూర్ పంచాయతీకి ఎన్నికలు నిర్వహించడం ఖాయం కావడంతో పోటీ చేసేందుకు పలువురు ఆశావహనేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఏజెన్సీలో మేజర్ గ్రామ పంచాయతీ అయిన ఉట్నూర్ పై ప్రధాన రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టిని సారిస్తున్నాయి.

అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా 22న ర్యాలీ

ఆదిలాబాద్‌రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించేలా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 22న ఆదివారం ఉదయం 11గంటలకు జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్లు అంబేద్కర్ ఆత్మ గౌరవ ఉమ్మడి ఉద్యమ కార్యచరణ కమిటీ నాయకులు అగ్గిమల్ల గణేష్ అన్నారు. జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ భవనంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పార్టీలు, కులాలు మతాకు అతీతంగా తీర్మానించినట్లు చెప్పారు. కేంద్ర హోంశాఖ మంత్రి వెంటనే అంబేద్కర్‌కు క్షమాపణ చెప్పాలని, తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అంబేద్కర్ ఆత్మగౌరవ ఉమ్మడి ఉద్యమ కార్యచరణ కమిటీ నాయకులు రత్నపురం రమేష్, దాండిగే సందీప్, నిమ్మల ప్రశాంత్, భూమన్న, నవీన్ కుమార్, దయాకర్, నజీర్, జహీర్ రంజాని, రత్నజాడే ప్రజ్ఞకుమార్, గణేష్ మెకానే, మనోజ్, ప్రసన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల పంపిణీ

తలమడుగు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలంలోని రుయ్యాడి గ్రామంలో శుక్రవారం మనపల్లె స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద గ్రంథాలయానికి రూ.15వేల విలువ చేసే పోటీ పరీక్షల పుస్తకాలను ఆ సంస్థ అధ్యక్షుడు బద్దం నర్సింగ్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సభ్యులు వారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు భావిఉద్యోగులను తయారుచేసే ప్రయోగశాల అని తెలిపారు. ప్రతిఒక్కరు తమవంతుగా గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాల వికాస కో ఆర్డినేటర్ ప్రసూన్‌రెడ్డి, కారోబార్ సంజీవ్ రెడ్డి, గొనేల గంగన్న, గ్రంథాలయ సభులు చైతన్య, మహేష్, నరేష్, కళ్యాణ్, వికాస్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేను వేగవంతం చేయాలి

● భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్

భైంసా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల గుర్తింపు సర్వేను వేగవంతం చేయాలని భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణ పరిధిలోని పలు వార్డులలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల గుర్తింపు సర్వేను క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా వార్డు అధికారులకు సర్వే నిర్వాహణ వ్యవస్థపై దిశ,నిర్దేశం చేశారు. ప్రభుత్వం విధించిన గడువులోగా ప్రక్రియ పూర్తి చేసేందుకు గాను సర్వేను మరింత వేగవంతంగా చేపట్టాలన్నారు. ఇందులో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిణి అనురాధ, డిప్యూటీ ఇంజనీర్ సంతోష్‌లతో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన ఎంపీడీవో

లక్ష్మణచాంద, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని న్యూ కంజర్, బోరేగాం గ్రామ పంచాయతీలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో రాధారాథోడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఇందిరమ్మ సర్వేను పారదర్శకంగా నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి డాటాను యాప్‌లో పొందుపరచాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించాలని తెలియజేశారు. అలాగే న్యూ కంజర్ గ్రామంలో వెంటనే ట్రాక్టర్ రిపేర్ చేయించి ప్రతిరోజు చెత్తను సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అమీర్‌ఖాన్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కిష్టాపూర్ గ్రామంలో ..

లోకేశ్వరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని లోకేశ్వరం ఎంపీడీవో రమేష్ అన్నారు. సర్వే ప్రక్రియను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదల సొం తింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేపట్టిందన్నారు. ఈ సర్వేలో పాల్గొన్న అధికారులకు పలు సూచనలు చేశారు. లబ్ధిదారుల వివరాలు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సురేష్‌గౌడ్, ఆపరేటర్ రాంచందర్, ఫ్రెండ్స్ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



భైంసాలో ఇందిరమ్మ సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఇందిరమ్మ ఇళ్ల నమూనాను వేసిన అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించబోతున్న ఇందిరమ్మ ఇళ్ల నమూనాను లోకేశ్వరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఖాళీ స్థలంలో ముగ్గుతో వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమేష్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం నిర్మించబోయే ఇందిరమ్మ ఇళ్లు ఈ నమూనా మాదిరిగానే నిర్మిస్తామన్నారు. ఈ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎంత స్థలం అవసరం పడుతుందో ఈ నమూనా ద్వారా తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, హౌసింగ్ ఏఈ, మండల సర్వేయర్, ఆర్ఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు ధోరణితోనే కేటీఆర్‌పై కేసు నమోదు

● బీఆర్‌ఎస్ ముధోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్‌కోమ్రేవార్

భైంసా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నిస్తున్నందుకే కేటీఆర్‌పై రేవంత్ సర్కార్ కక్ష సాధింపు దోరణి విధానాలతో కేసు నమోదు చేసిందని బీఆర్‌ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్ కోమ్రేవార్ ఆరోపించారు. ఈ మేరకు సంబంధిత విషయంలో శుక్రవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ప్రజల పక్షాన పోరాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నాడనే అక్కసుతో కేటీఆర్‌పై అక్రమంగా కేసు నమోదు చేసారని ధ్వజమెత్తారు. ప్రజా క్షేత్రంలో రోజురోజుకు రేవంత్ సర్కార్ గ్రాఫ్ పడిపోతుండగా కేటీఆర్ సారథ్యంలోని బీఆర్‌ఎస్‌కు ప్రజాధరణ పెరుగుతుండటంతో జీర్ణించుకోలేక పోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత విధానాలను అవలంభిస్తోందని దుయ్యబట్టారు.

కేటీఆర్‌ను నేరుగా నిలువరించడంలో విఫలమవుతున్న ప్రభుత్వం పరోక్షంగా కేసుల ద్వారా అణగదొక్కాలని యత్నిస్తోందన్నారు. ప్రశ్నించే గొంతుకపై నిర్బంధకాండ కొనసాగించే లక్ష్యంతోనే సర్కార్ కేసు నమోదుకు దిగజారిపోయిందన్నారు. కేసులు, అరెస్టులు తమ పార్టీకి కొత్త కాదని ప్రభుత్వం గుర్తించాలన్నారు.కేటీఆర్‌పై అక్రమంగా నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడనుందని స్పష్టం చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో బాధిత కుటుంబాలకు బాసట

● ముధోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్

భైంసా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రులలో చికిత్సలు పొందిన బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ బాసటగా నిలుస్తోందని ముధోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ వెల్లడించారు. శుక్రవారం భైంసాలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు వైద్య ఖర్చులు ఆర్థిక భారం కాకుడదనే లక్ష్యంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందించి తోడ్పాటును అందిస్తున్నామని వివరించారు.ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం బాధిత కుటుంబాలు తమ క్యాంపు కార్యాలయంలో పూర్తి డాక్యుమెంట్లతో సంప్రదించాలని సూచించారు. ఇందులో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, మాజీ సర్పంచ్ వినోద్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని భైంసా ఎమ్మెల్యేకు వినతి



కుబీర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని ఎస్ఎస్ఏ ఉద్యోగులు శుక్రవారం ముధోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావుపాటిల్‌కు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. మండల కేంద్రంలో ఓ శుభకార్యానికి హాజరైన ఎమ్మెల్యేతో సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడారు. తమ న్యాయమైన డిమాండ్స్‌ను శాసన సభలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు పుప్పాల ఆనంద్, ప్యాట లక్ష్మణ్, కోలేవార్ పోతన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులు వరి కొయ్యలను కాల్చవద్దు

● జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి అంజిప్రసాద్

సోన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూచన్‌పెల్లి గ్రామంలో వరి కొయ్యల మీద, సోన్ మండల కేంద్రంలో అధిక యూరియా వాడడం మీద రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పంట కోత కోసిన తర్వాత వరి కొయ్యలను కాల్చడం వల్ల నేల సారం దెబ్బతింటుందని, నేలలో మిత్ర పురుగులు నశించి పోతాయని తెలిపారు. కావునా రైతులు వరి కొయ్యలను భూమిలోనే కలియబెట్టాలని తెలిపారు. మొక్కజొన్న పంటలో అధిక యూరియా వాడడం వలన పెట్టుబడి పెరగడమే కాకుండా భూసారం దెబ్బతింటుందని తెలిపారు. అలాగే యూరియా బదులు నానో యూరియా వాడటం వల్ల అధిక లాభాలు ఉన్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కారయక్రమంలో ఏవో వినోద్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

కాల్వ తండాలో రైతులకు అవ గాహన



దిలావర్‌పూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంఏవో రాజశేఖర్‌రెడ్డి

దిలావర్‌పూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరి కోత తర్వాత వరి కొయ్యలను కాల్చడం మంచిది కాదని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కాల్వ తండాలో రైతులకు అవగాహన కల్పించారు. వరి కొయ్యలను కాల్చి వేయడం వల్ల పంట దిగుబడులకు సహకరించే మిత్ర పురుగులు చనిపోతాయన్నారు. సూక్ష్మ పోషకాలు నశిస్తాయని తద్వారా భూసారం దెబ్బతింటుందన్నారు. వరి కొయ్యలను భూమిలోనే కలియ దున్నాలన్నారు.

వరి కొయ్యలు కాల్చితే భూసారం తగ్గుతుంది

నర్సాపూర్(జి), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపూర్, చర్లపల్లి, చాక్‌పల్లి, గొల్లమాడ గ్రామాల్లో శుక్రవారం మండల విస్తరణ అధికారులు వరి కొయ్యలను కాల్చితే భూసారం తగ్గుతుందని పంట క్షేత్రాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ విస్తరణ అధికారి రమ్య మాట్లాడుతూ... వరి కొయ్యలు కాల్చడం వల్ల సేంద్రియ కర్బనం తగ్గి నేలలు నిర్జీవం అవుతాయన్నారు. వాయు కాలుష్యం పెరిగి పంట దిగుబడులు తగ్గుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, విస్తరణ అధికారులు భాగ్యలక్ష్మీ, చంద్యాల గణేష్ పాల్గొన్నారు.

బాసర, డిసెంబరు, 20 : (ఆంధ్రజ్యోతి) : వరి పంట కోత తర్వాత కొయ్యలను కాల్చవద్దని బాసర మండల వ్యవసాయ అధికారి శ్రీకర్ తెలిపారు. శుక్రవారం బాసర మండల కేంద్రంలో రైతులకు పంట పొలాల్లో అవగాహన కల్పించారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు చనిపోతాయని వివరించారు. భూమి పై పొరలో భూసారం దెబ్బ తింటుందని పేర్కొన్నారు.

ఖోడద్ పాఠశాలలో ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



వంటలను రుచి చూస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి

తలమడుగు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలంలోని ఖోడద్ గ్రామంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో తెలంగాణ వంటకాల ఆనందమేళా ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పిల్లలు తయారుచేసిన రుచికరమైన తెలంగాణ వంటకాలు ఇంతగానో ఆకట్టుకున్నాయి. పిల్లలు తయారుచేసిన రుచికరమైన వంటలను తిన్న ప్రజాప్రతినిధులు అధికారులు ఉపాధ్యాయులు విద్యార్థులను ఎంతగానో అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ జడ్పీటీసీ గోకగణేష్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల కోసం కంప్యూటర్లను, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను రుచికరమైన ఆహారాన్ని అందించండి, ఇటీవలనే మేస్‌చార్జీలు పెంచడం జరిగిందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండాచేయడం జరిగిందన్నారు. గత పది సంవత్సరాల నుంచి ఉపాధ్యాయులకు బదిలీలు పదోన్నతులు లేక ఇబ్బందులు పడ్డారని కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే బదిలీలు పదోన్నతులు చేపట్టడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్యాణం లక్ష్మీ రాజేశ్వర్, మాజీ సర్పంచులు సాకె ఆనంద్, పురుషోత్తం, ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి, రిటైర్డ్ గ్రామీణ బ్యాంక్ అధికారి చిన్నయ్య, గ్రామ పెద్దలు చిలుకూరు వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, మాజీ కో ఆప్షన్ మెంబర్ బాబు ఖాన్ దేవీదాస్ సంతోష్ , రావుల నారాయణ, రాకేష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బోరిగాంలో జాతర



ముస్తాబైన ఆంజనేయ స్వామి ఆలయం



బోనాలను సమర్పించడానికి వెళ్తున్న గ్రామస్తులు

- ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి తరలిరానున్న భక్తులు
- ఆలయంలో అభిషేకాలు
- మధ్యాహ్నం నుంచి కొనసాగనున్న కుస్తీ పోటీలు

తానూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరిగాం గ్రామంలో ఆంజనేయ స్వామిజాతర మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ జాతర మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం మహాలక్ష్మీ అమ్మవారికి, గ్రామదేవత పోచమ్మకు బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, ఇతర గ్రామాల నుంచి వచ్చిన ఆడపడుచులు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. భాజాభజంత్రీలతో, మంగళవాయిద్యాలతో అమ్మవారులకు బోనాలను సమర్పించారు. అనంతరం మహాహారతి నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. శనివారం ఉదయం ఆంజనేయ స్వామి వారికి అభిషేకం పూజ కార్యక్రమంతో పాటు హారతి కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు కొనుగోలు చేసేందుకు వివిధ రకాల దుకాణాలు ఏర్పాటవుతాయి. అదే విధంగా చిన్నపిల్లలకు, యువతీయువకులకు ఉత్సాహంగా ఆడుకోవడానికి రంగులరట్నం తదితర వాటిని ఏర్పాటు చేస్తారు.

● జాతర సందర్భంగా కుస్తీ పోటీలు

మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కుస్తీపోటీలు నిర్వహిస్తారు. ఈ కుస్తీపోటీల్లో గెలిచిన మల్లయోధులకు మొదటి బహుమతిగా రూ.10,001, ద్వితీయ బహుమతి రూ.7,501, మూడోబహుమతి రూ.5,001 అందించడం జరుగుతుంది. అదే విధంగా రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో దుర్గాజీ నాందేడ్‌కర్ వారి ఆధ్వర్యంలో పౌరాణిక నాటకాలను నిర్వహిస్తారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరై తిలకించాలని గ్రామ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

● 21ఏళ్లుగా అభిషేకం

పల్లెవిఠల్, ఆలయ కమిటీ సభ్యులు



గ్రామంలోని ప్రజలందరూ కలిసి మెలసి 21 సంవత్సరాలుగా ఆంజనేయ స్వామి వారికి అభిషేక కార్యక్రమం నిర్వహిస్తున్నాం. అనంతరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మహాఅన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తాం. తానూర్ మండలంతో పాటు చుట్టు పక్కల మండలాలైన కుభీర్, భైంసా, ముధోల్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, మహారాష్ట్రలోని ధర్మాబాద్, భోకర్, నాందేడ్ ఆయా పట్టణాల భక్తులు పాల్గొంటారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



నూతన శాఖను ప్రారంభిస్తున్న చైర్మన్ వై.శోభా, కలెక్టర్ రాజర్షిషా

ఇంద్రవెల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలు విస్తృతపరుస్తున్నట్లు ఆ బ్యాంకు రాష్ట్ర చైర్మన్ వై.శోభా అన్నారు. మండలంలోని ముత్నూర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన శాఖను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో కలిసి ప్రారంభించారు. ముందుగా ఆదివాసీల ఆరాధ్య దైవం కేస్లాపూర్ నాగోబా దేవతను దర్శించుకున్నారు. అనంతరం ముత్నూర్‌లోని ఆదివాసీ పోరాట యోధుడు కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 431 బ్రాంచ్‌లతో 40 వేల కోట్లు టర్నోవర్‌తో బ్యాంకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సౌలభ్యం, సేవలు, వారి ఆర్థిక అవసరాలు తీర్చేందుకే తాము, తమ సిబ్బంది నిరంతరం సేవలు అందిస్తారని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో పంట రుణాలు, వివిధ చిన్నతరహా పరిశ్రమలకు, స్వయం సహాయక సంఘాలకు, పెద్దఎత్తున పెట్టుబడుల కోసం రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీ ణప్రాంతాల్లోని వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతులు, చిరు వ్యాపారులు, స్థానిక ప్రజలు బ్యాంకు సేవలను ఉపయోగించుకోవాల ని అన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, అసిస్టెంట్ కలెక్టర్ అభిగ్యాన్ మలవియా, రీజనల్ మేనేజర్ డీ. ప్రభుదాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పల్ కుమార్, బ్యాంకు మేనేజర్ రమేష్, గ్రామ పటేల్ హెచ్ కే. జంగు, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో బాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన

కుబీర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అన్నాబాహుసాఠే కుడలి సమీపంలో కుమ్మరిగల్లీ మహిళలు తమ కాలనీకి నెలరోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని శుక్రవారం కాలనీమహిళలు గ్రామపంచాయతీ కార్యాలయం ముందు నిరసన చేశారు. సంబంధిత అధికారి తమ సమస్య పరిష్కరించేంత వరకు వెళ్లేది లేదని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. నెలరోజులుగా తమ కాలనీకి నీటి సరఫరా జరగడం లేదని, దీంతో ఇతర కాలనీల నుంచి నీటిని తీసుకురాలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయమై పంచాయతీ సిబ్బందికి అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా తమ గోడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేపటి వరకు సమస్య పరిష్కరించకపోతే కుభీర్-భైంసా రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహిస్తామని అన్నారు. సమాచారం అందుకున్న జీపీ కార్యదర్శి రాజేశ్వర్ పంచాయతీ కార్యాలయానికి చేరుకొని సముదాయించారు. రేపటివరకు తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు వెనుదిరిగారు.



గ్రామ పంచాయతీ వద్ద మహిళల నిరసన

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



పేపర్ బ్యాగ్స్, గాలిపటాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సోన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల చిట్టి మెదళ్లకు గొప్ప ఆలోచన తట్టింది. ప్రతిరోజు తమ ఇంట్లో వినియోగిస్తున్న ప్లాస్టిక్ సంచుల వల్ల కలిగే పర్యావరణ సమస్యలను నివారించడానికి వాడిన పాత వార్తా పత్రికలు, పనికి రాని కాగితాలతో 'పేపర్ బ్యాగ్స్‌'ను తయారు చేశారు. నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డులు పెళ్లిపత్రికలతో తయారు చేశా రు. గాలి పటాలను కూడా పాత న్యూస్‌పేపర్‌తో తయారుచేసి పాఠశాలలో ప్రదర్శనకు పెట్టారు. ఈ విధంగా చిట్టి విద్యార్థులకు వచ్చిన ఆలోచన ఉపాధ్యాయులకు, పోషకులకు ఆశ్చర్యం కలిగించింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఇళ్లల్లో ప్లాస్టిక్ సంచులకు బదులుగా పేపర్ బ్యాగులను మాత్రమే వాడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం లో మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ మాట్లాడుతూ... విద్యార్థులు చేసిన ప్రాజెక్టు పనులను చూసి అభినందించారు. ఉపాధ్యాయులు రమేష్ బాబు, మంగమ్మ, శైలజ, విజయవాణి, రాధా, పోషకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌డీఓ దేబోజిత్ బరువ



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

నేరడిగొండ, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): ఆర్థికసైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ ఆఫీసర్ (ఎల్‌డీఓ) దేబోజిత్ బరువ అన్నారు. శుక్రవారం నేరడిగొండ మండలంలోని తర్నం గ్రామంలో ఆర్బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై గ్రామస్థులతో మాట్లాడుతూ బ్యాంకు సేవలు ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలని కుటుంబ పోషణ కోసం బడ్జెట్ చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రత పథకాలు, లోన్స్ ఉపయోగించుకోవాలని సూచించారు. క్లస్టర్ కో-ఆర్డినేటర్ జుగ్నక్ గంగాధర్ మాట్లాడుతూ రైతులు తీసుకున్న పంట రుణాలపై మాట్లాడుతూ సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వామి, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్స్ సంతోష్, దంజీ, అరవింద్, గ్రామపెద్దలు గ్రామస్థులున్నారు.

ఘనంగా ధర్మారం కోతి దేవుడి జాతర

భక్తి



కోతి దేవుడి దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు



రంగుల రాట్నం వద్ద యువతీ యువకుల సందడి



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మారం గ్రామంలో గల కోతి దేవుడి జాతర శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గత రెండు రోజులుగా కోతి దేవుడి ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్న సంగతి అందరికీ తెలిసిందే. రెండవ రోజు కోతి దేవుడిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. దర్శనం అనంతరం జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోతి దేవుడి ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం నిర్వహించింది. చట్టు ప్రక్కల గ్రామాల నుండి వచ్చిన జనంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. జాతర సందర్భంగా వచ్చిన దుకాణా సముదాయాలు, రంగుల రాట్నం, జారుడు బండ వంటి వాటితో జాతర ప్రాంతమంతా కళకళలాడింది. ఈ జాతరలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఎస్సై సుమలత ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నడిరోడ్డుపై భోజనాలు చేస్తూ నిరసన



రోడ్డుపై భోజనాలు చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

ఆదిలాబాద్‌రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం 11వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరం వద్ద వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణం లోని ఎన్టీఆర్ చౌక్‌కు ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం అక్కడే రోడ్డుపై భోజనాలు చేస్తూ నిరసన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ అమ లుచేయాలని వంటావార్పుతో సీఎంలో మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.



భోజనాలు చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

పేదలకు చూపును అందిస్తున్న

ముథోల్ కంటి ఆసుపత్రి

● మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ రావు పటేల్

ముథోల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పేదలకు చూపును అందిస్తున్న ముథోల్ భోస్లే గోపాల్‌రావు కంటి ఆసుపత్రి అని ముథోల్‌మాజీఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో శుక్ర వారం భోస్లేగోపాల్ రావు కంటి దవాఖాన 28వ వార్షికో త్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. పేదకళ్లల్లో కాంతి రేఖలను నింపుతూ ఎందరో మన్ననలు పొందుతుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ ఆసుప త్రిలో 7,41,824 మందికి పరీక్షలు నిర్వ హించగా ఇందులో 90,151 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఇందులో 42,819 మంది పేద రోగులకు ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించి పేద ప్రజలకు బాసటగా ఉంటుందని పేర్కొన్నారు. ఎల్వీ ప్రసాద్ కంటి విజ్ఞాన కేంద్రం హైదరాబాద్ నేతృత్వంలో 20 డిసెంబరు 1996 సంవత్సరంలో ముథోల్ భోస్లే గోపాల్‌రావు కంటి దవాఖాన ప్రారంభమై నిరుపేదలకు ఉచిత కంటి పరీక్షలతో పాటు అవసర మైతే ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించి వారికి చూపును అందిస్తుందన్నారు. సుమారు 100 మంది రోగులకు కనుగుడ్డు మార్పిడి శస్త్ర చికిత్సలు కూడా నిర్వహిస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సం దర్భంగా ఈ సంవత్సరం బెస్ట్‌ఎంప్లాయ్‌గా మమతకు అందజేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముథోల్ మాజీ ఎమ్మెల్యే

అలాగే ఈ ఆసుపత్రి అభివృద్ధికై తనవంతు ఎల్లవేళలా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్‌చార్జి రాజశేఖర్, డాక్టర్ వివేక్, దావే ప్రవీణ్, డాక్టర్ దావే తరుజన్, డాక్టర్ శ్రావ్య రెడ్డి, డాక్టర్ ప్రనీతి, డాక్టర్ రోహన్, డాక్టర్ గౌరీ, డాక్టర్ కేసరి, పర్యవేక్షకులు సందీప్ రావు, శ్రీకాంత్, నరేష్ కుమార్, డాక్టర్ జకీన్, సాయన్న, గంగాధర్, నాగేష్, దత్తు, అక్షయ్ కుమార్, నాయకులు ప్రేమ్‌నాథ్ రెడ్డి, పతంగి కిషన్, ఖలీద్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన చలి తీవ్రత


• ఆదిలాబాద్‌లో 5.7 కనిష్ఠ ఉష్ణోగ్రతల నమోదు

ఆదిలాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గతవారం రోజులుగా వణుకు పుట్టించిన చలి కొంత తగ్గుముఖం పట్టింది. శుక్రవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 28.0 డిగ్రీలు కాగా, కనిష్ఠంగా 5.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భీంపూర్ మండలం అర్లి(టి)లో 14.0, ఆదిలాబాద్ అర్బన్‌లో 14.9, జైనథ్‌లో 15.2, తాంసిలో 15.6 జిల్లా వ్యాప్తంగా 20 డిగ్రీల వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం నుంచి వాతావరణం మేఘావృతం కావడంతో చలి కొంత తగ్గినట్లు అధికారులు పేర్కొంటున్నారు.



తుదిదశకు పంచాయతీ ఎన్నికల

కసరత్తు!



- జిల్లాలో 3,888 పోలింగ్ స్టేషన్లు ఫైనల్
- ఓటరు జాబితా, ఎంప్లాయిస్ డాటా ఎంట్రీ పూర్తి
- ఉట్నూర్‌లో 18 సహాయక పోలింగ్ కేంద్రాలు
- 31లోగా పోలింగ్ బ్యాలెట్ పత్రం సిద్ధం
- రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయితే ఇక ఎన్నికలే..

ఆదిలాబాద్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో పల్లె పోరుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు తుదిజాబితాను విడుదల చేసిన అధికారులు ఈ నెల 17న పంచాయతీ పోలింగ్ స్టేషన్లను ఫైనల్ చేశారు. జనవరి 14లోపు రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసి ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం కన్పిస్తోంది. ఇప్పటికే పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసి పోవడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. జిల్లాలో ఇటీవలే కొత్తగా 3 మండలాలు ఏర్పడ్డాయి. వీటిని కలుపుకొని మండలాల సంఖ్య 21కి చేరింది. ఆదిలాబాద్ అర్బన్ మండలం మినహా 20మండలాల పరిధిలో 473 పంచాయతీలు, 3,870 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం

4లక్షల 47వేల 135 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో పురుషులు 2లక్షల 18వేల 683 మంది కాగా మహిళలు 2లక్షల 28వేల 436 మంది మరో 16మంది ఇతరులు ఉన్నారు. అనుకున్న గడువులోగా పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మొదట పంచాయతీ ఎన్నికలను నిర్వహించి ఆ తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారయంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. అయితే జనవరి, ఫిబ్రవరి మాసాల్లోనే గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉంటాయని తేలిపోవడంతో గ్రామాల్లో రాజకీయ సందడి మొదలయ్యింది. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహ నేతలు ఇప్పటినుంచే ఓటర్ల మద్దతు కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

• 3,888 పోలింగ్ స్టేషన్లు

జిల్లాలో 473 పంచాయతీల పరిధిలో 3870 వార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 3,888 పోలింగ్ స్టేషన్లను గుర్తించిన అధికారులు ఇటీవలే ఫైనల్ చేశారు. దీంతో పోలింగ్ స్టేషన్ల వద్ద మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించారు. చిన్నపాటి మరమ్మతులు, పోలింగ్ స్టేషన్ల రూట్‌మ్యాప్, తాగునీరు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపులు, మరుగుదొడ్లు అలాగే పోలింగ్ స్టేషన్ల దూరభారం తగ్గించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. 0-200 ఓటర్ల వరకు 3,526 పోలింగ్ స్టేషన్లు ఉండగా 201 నుంచి 400 వరకు 316 పోలింగ్ స్టేషన్లు, 401 నుంచి 650 వరకు 46 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో (తరువాయి 4వ పేజీలో...)

సమగ్రశిక్షా ఉద్యోగుల వంటావార్పు



5

ఖాతాదారులకు మెరుగైన సేవలు





వివరాలు నమోదు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

• సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజ్‌వీర్

నేరడిగొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే మండలంలో కొనసాగుతోంది. శుక్రవారం మండలంలోని తేజాపూర్ గ్రామంలో చేపట్టిన సర్వేను ఎంపీడీఓ రాజ్‌వీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఇంటింటికి వెళ్లి పంచాయతీ సిబ్బంది పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని వెల్లడించారు.

గంజాయితో పట్టుబడ్డ ఒకరి అరెస్టు

బోథ్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నేరడిగొండ మండలంలోని రాజులతండ గ్రామానికి చెందిన చందర్‌సింగ్ అనే వ్యక్తి శుక్రవారం ఉదయం మండలంలోని పోచ్చెరా బస్టాండ్ వద్ద అనుమానస్పదంగా తిరగడంతో పోలీసులు ఆయనను గమనించారు. పోలీసులను చూసి పరిగెత్తేందుకు ప్రయత్నించగా పట్టుకొని విచారించారు. తాను గత ఏడాది రాజులతండా గ్రామంలో ఉన్న వ్యవసాయ భూమిలో గంజాయి సాగు చేశానని చెప్పాడు. పండించిన గంజాయిని బోథ్, ఇచ్చోడ మండలాల్లో విక్రయిస్తానని పోలీసులకు తెలిపినట్లు సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై ప్రవీణ్ తెలిపారు. పట్టుబడిన వ్యక్తి వద్దనుంచి 480 గ్రాముల గంజాయిని పట్టుకున్నామని, దాని విలువ రూ.12 వేలు ఉంటుందని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి రిమాండ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసిన తెలంగాణ ఉద్యమకారులు

తలమడుగు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను రాష్ట్ర తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఉద్యమకారులు తెలంగాణ విఠల్, శంకర్, బండి రమేష్, డాక్టర్ గోపాల్, వెంకటనారాయణ, డాక్టర్ మార్కోపోలోనిస్, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు గుంజల భాస్కర్‌రెడ్డి, బజార్‌హత్నూర్ మండల అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. కోదండరాంను శాలువతో సత్కరించారు. ఉద్యమకారులకు న్యాయం జరిగేలా సీఎంతో చర్చిస్తానని తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

ఇంధన పొదుపు పాటిద్దాం

ఇంద్రవెల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపును పాటిద్దామని ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ జూనియర్ మేనేజర్ శ్రీమన్నారాయణ అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరం లేని సమయంలో విద్యుత్ వాడకం తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఈవో విజయ్ కుమార్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ విఠల్, నాయకులు తుంరం మారుతి, పంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.



అవగాహన కల్పిస్తున్న శ్రీమన్నారాయణ

గడువులోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలి

• కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ రాజార్షిసా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఈఓ జితేందర్, డీఆర్డీఓ సాయన్న, ఎంపీడీఓలు, ఎంపీఓ, ఏపీడీలతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం అమలు తీరు, క్లస్టర్ల వారీగా పనిదినాలు, చేపడుతున్న పనులపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా వనమహోత్సవం, మహిళాశక్తి ఉపాధి భరోసా, స్వచ్ఛభారత్ మిషన్, సోషల్‌ఆడిట్‌లపై అన్ని మండలాల ఎంపీడీఓలు ఆయా మండలాల్లో సాధించిన లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. పొలం బాటలు (రోడ్స్ టూ అగ్రికల్చర్ ఫీల్డ్స్) వర్క్ టార్గెట్ 59.5 ఇందులో 200 మంజూరు కాగా, 6 గ్రౌండింగ్, చెక్‌డ్యామ్స్ పనులు టార్గెట్ 51 కాగా 85 మంజూరు 5 గ్రౌండింగ్, తదితర అంశాల పై సమీక్షించి లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో సాధించిన లక్ష్యాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఇందులో అధికారులు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా, సమావేశంలో పాల్గొన్న అధికారులు

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ఇంద్రవెల్లి, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొబైల్‌యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి సోలార్ ఎనర్జీ ద్వారా గ్రామంలో వంద శాతం ప్రతీ విద్యుత్ స్తంభాలకు సోలార్‌లైట్స్ వెలుగు అందించాలని ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపట్టిన మొబైల్ యాప్ తీరును పరిశీలించారు. సర్వేయర్లు ఇంటింటికీ తిరుగుతూ ఇందిరమ్మఇళ్ల పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న అర్జీదారుల వివరాలను సేకరిస్తున్న తీరును పరిశీలించి గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ యువరాజ్ మార్మాట్, అసిస్టెంట్ కలెక్టర్ అభిగ్యాన్ మలవియా, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో బాస్కర్, విద్యుత్ శాఖ ఏఈ రోహిదాస్, ఇంధన శాఖ జూనియర్ మేనేజర్ శ్రీమన్నారాయణ, పంచాయతీ ఈవో విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి వీఓఏలు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం నాగుల భగవంతు

జైనథ్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామంలో గల స్వయం సహాయక మహిళా సంఘాల బలోపేతానికి గ్రామీణ స్థాయిలో ఉన్న వీఓఏలు కృషి చేయాలని జైనథ్ మండల ఐకేపీ ఏపీఎం నాగుల భగవంతు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన జైనథ్ ఇందిరమ్మ మండల సమాఖ్య కార్యాలయంలో ఐకేపీ మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడంతో పాటు స్త్రీ నిధి రుణాలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు నాందేవ్, జి.శ్రీనివాస్‌రెడ్డి, జి.గంగారాం, ఎల్టివెంకట్‌రెడ్డి, టి.శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు ఆయా గ్రామాల స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

బోథ్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆంగ్లంలో తమ విన్యాసాలతో గణిత దినం ప్రదర్శించి ఆకట్టుకున్నారు. విద్యార్థులు వివిధ భంగిమలలో కూర్చొని ప్రదర్శించడం పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎడ్మల శైలజ విద్యార్థులను అభినందించారు.



నిరసన తెలుపుతున్న ఏఎన్ఎంలు

హాల్‌టికెట్లను తగలబెట్టి ఏఎన్ఎంల నిరసన

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): పరీక్ష విధానం లేకుండా తమను రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఎన్ఎంలు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పరీక్ష హాల్ టికెట్లను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకోగా స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. తమ న్యాయమైన డిమాండ్ల కోసమే రోడ్డుపైకి వచ్చామని ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించాలన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

జైనథ్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలంవరూర్ గ్రామానికి చెందిన ఆత్రం రాహుల్ శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన తండ్రి ఆత్రం భీంరావుకు అంత్యక్రియల కోసం యువజన కాంగ్రెస్ నాయకులు సామ రూపేష్‌రెడ్డి రూ.5వేలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దినేష్ పైకులతోపాటు కోలంవరూర్ గ్రామానికి చెందిన గిరిజనులు గ్రామస్థులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలి

• ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా

ఉట్నూర్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలు, ఆశ్రమ పాఠశాలల్లోని భవనాలకు మరమ్మతులు, రోడ్లు, వంతెన నిర్మాణ పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా ఇంజనీర్ అధికారులను సాధించారు. ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీఓ ఖుష్బుగుప్తా మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న వసతి భవనాలు, అదనపు తరగతి గదులు వంట గదులు ప్రహరీ, మరుగుదొడ్లని పూర్తి చేయాలన్నారు. అలాగే ఏజెన్సీ ప్రాంతంలో గల అంగన్‌వాడీ సెంటర్లు, సీసీ రోడ్లు, వంతెనల నిర్మాణాలను నెల వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే వర్షాకాలంలో దెబ్బతిన్న ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉండే ప్రాంతాల రోడ్లను, బ్రిడ్జిలను త్వరగా పూర్తిచేసి ప్రారంభించాలని అన్నారు. మరియు అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలను కూడా పూర్తిచేయాలని సూచించారు. అలాగే ఆర్ఓలకు మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. జరుగుతున్న పనుల ఫొటోలను రోజువర్క్ మానిటర్ సిస్టమ్‌లో పొందుపరచాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు త్వరగా చెల్లించే విధంగా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ నీరంజన్, డీఈలు శివప్రసాద్, సతీష్ ఉమ్మడి జిల్లాల ఏఈలు శంకర్, ఉజ్వల్, రఘు,సుధాకర్, సాయికృష్ణ, ఇందల్, ప్రదీప్, బద్రుదీన్, తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, హాజరైన ఇంజనీరింగ్ శాఖ అధికారులు



మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

• జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు నర్సింహులు

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదును వేగ వంతం చేయాలని తెలుగుదేశం పార్టీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్, తెలుగుయువత కమిటీ సమావేశాన్ని శుక్రవారం పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ కన్వీనర్ గుళ్లపెల్లి ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, రాష్ట్రతెలుగు యువత అధ్యక్షులు డాక్టర్ పొగాకు జయరాం చందర్‌లు హాజరై మాట్లాడారు. రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతం కోసం కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జయరామ్‌చందర్, గుళ్లపల్లి ఆనంద్, దుర్గారావు, ఆదిలాబాద్ నియోజకవర్గ మాజీఇన్‌చార్జీ అల్లూరి రాజారెడ్డి, మాజీ తెలుగు యువత అధ్యక్షులు గాలిపెల్లి నాగన్న, పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి పెరుగు ఆత్మరామ్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే గుజ్జర్ల తరహా ఆందోళన'



మాట్లాడుతున్న తుడందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడంగణేష్

ఉట్నూర్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే గుజ్జర్ల తరహా పోరాటం చేస్తామని ఆదివాసీహక్కుల పోరాటసమితి తుడందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న సమ్మె శిబిరానికి చేరుకుని సంఘీభావం తెలిపి మాట్లాడారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థుల విద్యఅభివృద్ధి కోసం ప్రభుత్వంతోపాటు జిల్లాఅధికార యంత్రాంగం స్పందించాలన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పంతాలకు పోకుండా సీఆర్టీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. తుడందెబ్బ గౌరవ అధ్యక్షుడు పంద్రాజైవంత్‌రావు, తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, కనక సంతోష్, జడం భారత్, పెందూర్ సంతోష్, కుంభప్రభలు పాల్గొన్నారు. అలాగే టీచర్ల రిలే నిరాహార దీక్షలకు టీపీటీఎఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతూ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగరావు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మర్సుకోల జ్ఞానేశ్వర్, రాష్ట్ర కౌన్సిలర్ వెడ్మశ్యాంరావు, తదితరులు పాల్గొన్నారు.